సాక్షి
పార్వతీపురం మన్యం
శనివారం ၊ 2 ၊ డిసెంబర్ ၊ 2023



భీష్మ సంకల్పం

విజయనగరం జిల్లాలో ప్రతి సంగీతాభిమాని నోటా వినే పేరు ఘంటసాల స్మారక కళాపీఠం భీష్మారావు. - 8లో



శారద కర్మాగారం వద్ద ఉద్రిక్తత

శారద కార్మాగారానికి చెందిన కార్మికుడు మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు ఆందోళన చేశారు. - 8లో



యూనిట్ల స్థాపనపై దృష్టి

యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

వేగవంతంగా ఓటరు జాబితా సవరణ ప్రకియ



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్‌కుమార్ మీనా ఆదేశించారు. ఓటరు జాబితా తయారీ ప్రక్రియపై జిల్లా కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిసెంబర్ 29 నాటికి ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు, ఫారం 6, ఫారం 7, ఫారం 8 పరిశీలన, పరిష్కరించడం, చనిపోయిన, శాశ్వతంగా వలసవెళ్లిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడం పూర్తిచేసి ఆరోగ్యకర ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారినందరినీ ఓటర్లుగా చేర్పడం వంటి కార్యక్రమాలను వేగవంతం చేయాలని, పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్, జేసీ ఆర్.గోవిందరావు, డీఆర్వో జె.వెంకటరావు, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ జి.కేశవనాయుడు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు భౌతికశాస్త్రం దోహదం

రాజాం సిటీ: సాంకేతికతలో నూతన ఆవిష్కరణలకు భౌతికశాస్త్రం దోహదపడుతుందని భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మంజుల అన్నారు. శుక్రవారం స్థానిక జీసీఎస్ఆర్ కళాశాలలో క్యూయూఏఆర్‌కేఎస్–2023 పేరిట ఫిజిక్స్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె భౌతిక శాస్త్ర ప్రాముఖ్యత, నానో టెక్నాలజీ ఆవశ్యకతను వివరించారు. నిత్య జీవితంలో ఫిజిక్స్ ఒక భాగమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, సెమినార్ తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తం పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది



ఉపాధ్యాయుడు కేవీఎస్ ప్రసాద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.శాస్త్రి

విజయనగరం రూరల్: సమాజానికి భవిష్యత్ తరాలను అందించే ఉపాధ్యాయవృత్తి ఎంతో గౌరవప్రదమైనదని కోరుకొండ సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి పేర్కొన్నారు. కోరుకొండ సైనిక పాఠశాలలో 37 ఏళ్లుగా గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న కేవీఎస్ ప్రసాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా సైనిక పాఠశాలలోని పీవీజీ రాజు ఆడిటోరియంలో శుక్రవారం ఆయనకు వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయ వృత్తి ద్వారా ఎంతో మంది భావి భారత పౌరులను ఉన్నతులుగా తీర్చిదిద్దే అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగేలా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులే కీలకపాత్ర వహిస్తారన్నారు. ఈ సందర్భంగా ఎన్నో అవార్డులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన కేవీఎస్ ప్రసాద్‌ను ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● తొలిరోజు 70 శాతం పంపిణీ

వైఎస్సార్ పింఛన్ల పంపిణీ శుక్రవారం ఉదయాన్నే వలంటీర్లు, గృహసారథులు ప్రారంభించారు. లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 1,43,976 మంది లబ్ధిదారులకు రూ.39.51 కోట్లు అందజేయాల్సి ఉండగా, తొలిరోజు 70 శాతం మందికి పింఛన్లు అందజేసినట్టు డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ తెలిపారు.

– పార్వతీపురంటౌన్



పార్వతీపురం పట్టణం 7వ వార్డు లబ్ధిదారు దండుపాటి యర్రమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వాసంతి, వెల్ఫేర్ కార్యదర్శి రాఘవాచారి



పట్టణంలో 13వ వార్డుకు చెందిన లబ్ధిదారు దొనక కన్నమ్మకు జిల్లా ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పద్మ



8వ వార్డులో లబ్ధిదారు పోలమ్మకుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సింహాచలం



పార్వతీపురం పట్టణంలోని 7వ వార్డులో లబ్ధిదారు కర్రి రాములుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గాయత్రి

ఈవీఎం పనితీరు పరిశీలన

పార్వతీపురం: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం) పనితీరు ప్రదర్శన (డిమానిస్ట్రేషన్)ను కలెక్టర్ నిషాంత్‌కుమార్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలో ఓటు వేసి పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నాలుగు శాసనసభ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఈవీఎంల పని తీరును తనిఖీ చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. జేసీ ఆర్.గోవిందరావు, పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్వో జె.వెంకటరావు, అధికారులు తమ ఓటును వేసి పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ పాలన అధికారి ఉమామహేశ్వరరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండకోనల్లో ప్రగతి బాటలు



- గిరిజన గ్రామాలకు మార్గం సుగం
- 530.55 కి.మీ మేర రోడ్ల నిర్మాణం
- ఐటీడీఏ పరిధిలో జోరుగా సాగుతున్న పనులు
- డిప్యూటీ సీఎం రాజన్నదొర చొరవతో నిధుల మంజూరు



సాలూరు మండలం సిరివరకు జరుగుతున్న మెషిన్ కటింగ్‌తో కూడిన రోడ్డు పనులు

సాలూరు:

రాష్ట్ర ప్రభుత్వం కృషితో ఏజెన్సీలోని రాళ్లదారులన్నీ ఒక్కొక్కటిగా రాచబాటలుగా మారుతున్నాయి. గిరిజన గూడలకు 'మార్గం' సుగమమవుతోంది. విద్య వైద్య సదుపాయాలు చేరువవుతున్నాయి. అటవీ ఉత్పత్తుల తరలింపు సులభతరమవుతోంది. నాలుగున్నరేళ్లుగా మన్యంలో ప్రగతి మంత్రం మార్మోగుతోంది. కోట్లాది రూపాయల వ్యయంతో మన్యంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఏ పల్లెకు వెళ్లినా అభివృద్ధి పనుల తీరు కళ్లకు కడుతోంది.

మారిన చరిత

గిరిజనుల చరిత మారింది. గతంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కొండల్లో నివసించే గిరిజనుల బాగోగులు పట్టించుకోవడం అరుదు. నేడు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సచివాలయ వ్యవస్థతో ప్రతీ 50 కుటుంబాలకు ఓ వలంటీరు నియామకమయ్యారు. అర్హతే కొలమానంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరవుతున్నాయి. ఆర్థికోన్నతికి అవకాశం కలిగింది. సచివాలయాల ఏర్పాటుతో కొండలు దిగే అవసరం లేకుండానే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. సమస్యల గుర్తింపు, పరిష్కారం వేగవంతమైంది. గిరిజన గూడల్లో నవరత్న వికాసం స్పష్టంగా కనిపిస్తోంది. గిరిపుత్రులు విద్య, ఉద్యోగ రంగాల్లో రాణిస్తున్నా రు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి కల్పి స్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ మన్యం చరితను మార్చేలా ఎదుగుతున్నారు. బడుగులకు కల్పించిన రాజ్యాధికారంతో మన్యం ప్రజల భవిత కు గట్టిపునాది వేస్తున్నారు. ఇందులో డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర, కురుపాం, పార్వతీపురం, పాలకొండ ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాని, అలజంగి జోగారావు, విశ్వాసరాయి కళావతి ముందువరసలో ఉన్నారు. ఐటీడీఏల పరిధిలో 530.55 కిలోమీటర్ల రోడ్ల పనుల పూర్తికి అవిశ్రాంతంగా కృషిచేస్తున్నారు.

పనుల జోరు

మన్యంలో ఏ గ్రామానికి వెళ్లినా పనుల ప్రగతి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వ భవనాలతో పాటు విద్యాలయాలు, ఆస్పత్రులు, రోడ్లు, వంతెన నిర్మా ణాలు, వసతిగృహ భవనాలు, కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు కనిపిస్తాయి. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చుతోంది. ఒక్క సాలూరు నియోజకవర్గంలోనే ఐటీడీ పరిధిలో రూ.184కోట్ల వ్యయంతో 532 పనులు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటికే 142 పనులు పూర్తికాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. రూ.17కోట్ల ఖర్చుతో 210 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాలు సాగుతున్నాయి.

కొత్తగా మంజూరైన రోడ్ల పనులు ఇలా..

నియోజకవర్గం పేరు	పనుల సంఖ్య	రోడ్ల విస్తీర్ణం (కి.మీ.లలో)	అంచనా వ్యయం (రూ.లక్షల్లో)
సాలూరు	212	210	1700
కురుపాం	61	54.45	458
ఎస్.కోట	2	2	20
పాలకొండ	32	34.70	265
పాతపట్నం	25	31.50	203
పలాస	27	28.30	207
పాడేరు	57	76.5	500
అరకు	64	63.10	467.80
రంపచోడవరం	45	30	240



కురుకూటి పంచాయతీలో చినబారిగాం నుంచి పెదబారిగాంకు వేసిన బీటీ రోడ్డు

రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యం



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర చొరవతో గిరిజన గ్రామాలకు అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతంలోని 9 నియోజకవర్గాల్లోనూ రోడ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. గిరిశిఖర గ్రామాలకు 'మార్గం'సుగమం అవుతోంది.

– శ్రీనివాస్, ఈఈసీ, గిరిజన సంక్షేమశాఖ

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ కోరారు. జిల్లా, మండల అధికారులతో శుక్రవారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సహాయక చర్యలకు కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఆహార సరఫరా ఏర్పాట్ల కోసం ఎంఎల్‌ఎస్ పాయింట్లను అనుసంధానం చేయాలని ఆదేశించారు. వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులను అప్రమత్తం చేయాలన్నారు. ఇప్పటికే కోసిన వరి పంటను శనివారం సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లపై చెట్లు పడిపోతే రాకపోకలకు అంతరాయం లేకుండా వెంటనే వాటిని తొలగించేందుకు అవసరమైన మెషనరీలను, కట్టర్లను, జేసీబీలను సిద్ధం చేయాలన్నారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్ సిబ్బంది చెరువులు, ఆనకట్టలను తనిఖీ చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మత్స్యకారులు నదులు, చెరువులకు వేటకు వెళ్లకుండా సూచనలు చేయాలన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. విపత్తులు సంభవించే అవకాశం ఉన్న ప్రదేశాలను ముందుగా గుర్తించాలన్నారు. వాతావరణ హెచ్చరికలు మేరకు ప్రస్తుతం ఆగ్నేయ దిశగా నెల్లూరు దగ్గర తుపాను కేంద్రీకృతమై ఉందని, వాయువ్య దిశగా పయనించి రెండు, మూడు రోజులు కోస్తాంధ్రాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసినట్టు వెల్లడించారు. టెలీ కాన్ఫరెన్సులో జేసీ ఆర్.గోవిందరావు, డీఆర్వో జె.వెంకటరావు, అదనపు ఎస్పీ డా.దిలీప్‌కిరణ్, డీపీఓ బి.సత్యనారాయణ, వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, తదితరులు ఉన్నారు.

● చి'వరి'లో శ్రమిస్తూ...

వాతావరణ శాఖ తుపాను హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు అప్రమత్తమయ్యారు. ఆరుగాలం శ్రమించి చేతికందొచ్చిన వరి పంటను కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. కొందరు రైతులు కోసిన చేనును పొలాల్లోనే కుప్పలు పెడతుండగా, మరికొందరు రైతులు పల్లపు పొలాల్లోని చేనును కల్లాలకు చేర్చుతున్నారు. కాడెద్దులు ఖాళీలేక రైతులే టైరుబండి పూజను భుజనావేసుకుని ముందుకు 'సాగు'తున్నారు. దీనికి సంతకవిటి మండలం మిర్తివలస-మల్లయ్యపేట గ్రామాల మధ్య 'సాక్షి'కి చిక్కిన ఈ చిత్రమే సజీవ సాక్ష్యం.

- రాజాం



విద్యల నగరంలో పుట్టడం అదృష్టం



సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్‌ను ఘంటసాల స్మారక పురస్కారంతో సత్కరిస్తున్న కళాపీఠం వ్యవస్థాపకులు

- ఘనంగా ఘంటసాల జయంతి
- అలరించిన ఘంటసాల సినీ, సంగీత విభావరి

విజయనగరం టౌన్: మహనీయులు నడయాడిన నేలపై పుట్టడం నా అదృష్టం.. శతాబ్ది గాయకుడు పద్మశ్రీ ఘంటసాల జయంతిని పురస్కరించుకుని గాన గంధర్వుని ఆశీస్సులు లభించడం ఆనందంగా ఉంది.. ఈ పురస్కారం తన జీవితంలో మరిచిపోలేనిదని సినీ, సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ అన్నారు. ఘంటసాల 108వ జయంతిని ఘంటసాలస్మారక కళాపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ నా జీవితంలో తొలిసారిగా నేను నేర్చుకున్నదే ఘంటసాల పాట అని తెలిపారు. జంధ్యాల పాపయ్యశాస్త్రి రచనలో 'నేనొక పూలమొక్క కడలించి.. తళుక్కుమన్నది పుష్పవిలాప కావ్యమై.. అంటూ పాడి ఆహుతుల కరతాళ ధ్వనులందుకున్నారు. తను ఎవరివద్ద సంగీతంలో శిష్యరికం చేయకపోయినా సంగీతదర్శకుడిగా ఎదగడం విద్యలనగరం గొప్పతనంగా పేర్కొన్నారు. సమాజంలో మార్పుకోసం ట్రిగ్గర్ అనే షార్ట్‌ఫిల్మ్ చేశానని, ఇది సమాజంలో మార్పు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది ఆస్కార్ అవార్డుకు క్వాలిఫై అయిందన్నారు. ఘంటసాల వంటి దిగ్గజం సంగీత ప్రపంచంలో మరెవ్వరూ లేరన్నారు. అటువంటి మహనీయుడు ఏలిన సంగీత ప్రపంచంలో తను ఒక సంగీత దర్శకుడు కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. తనను విజయనగరం పిలిచి సత్కరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌కౌశిక్, డాక్టర్ ఎ.గోపాలరావు, ఈఆర్ సోమయాజులు తదితరుల చేతుల మీదుగా ఘంటసాల స్మారక పురస్కారం అందుకున్నారు.

అలరించిన సంగీత స్వరాభిషేకం

ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో గానగంధర్వునికి నిర్విరామంగా 12 గంటలపాటు ఘంటసాల స్వరాభిషేకం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు గాయనీ, గాయకులు ఆలపించిన పాటలు ఆద్యంతం ఆహుతులను అలరించాయి. ఇండియన్ ఐడల్ సాయి, పవన్ ఆర్కెస్ట్రాలో ప్రత్యేక ఆహ్వానిత గాయని సౌజన్య అద్భుతమైన పాటలతో ఆకట్టుకున్నారు. కళాపీఠం వ్యవస్థాపకుడు ఎమ్.భీష్మారావు, ఎస్.జోగారావు, బి.ఉమాశంకర్ సారథ్యం వహించారు. కార్యక్రమంలో సాహితీవేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ, అక్షయ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఏగిరెడ్డి తిరుపతినాయుడు, ధవళ సర్వేశ్వరరావు, గ్రంధి విష్ణుమూర్తి, పి.వి.నరసింహరాజు, మేకా అనంతలక్ష్మి, వైవీవీ అబ్బులు, కాపుగంటి ప్రకాష్ పాల్గొన్నారు.



సంగీత విభావరిలో పాల్గొన్న గాయనులు

విజయవంతంగా సామాజిక సాధికార యాత్ర

- ఉమ్మడి విజయనగరం జిల్లాలో 9 నియోజకవర్గాల్లో పూర్తి
- త్వరలో విజయనగరం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో బస్సు యాత్రలు
- 2024 ఎన్నికల్లో 2019 ఫలితాలు పునరావృతం కావడం ఖాయం
- ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరంలో అందరం పాల్గొందాం
- విజయనగరం జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన సామాజిక సాధికార యాత్ర విజయంతంగా సాగిందని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం బడుగు, బలహీనవర్గాల వారికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యాధికారం కల్పించారన్నారు. త్వరలో విజయనగరం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో యాత్ర చేపడతామని వెల్లడించారు. జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ ఆలోచనలు, జ్యోతిబాపూలే ఆశయాలు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు భావజాలంతో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాల ప్రజలను మాటలు గారెడీతో మభ్యపెడితే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆచరణలో చేసి చూపించిందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారన్నారు. వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 2019 ఎన్నికల ఫలితాలు పునరావృతం కావడం ఖాయమన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

క్రీడా సంబరంలో భాగస్వాములమవుదాం

దేశంలో ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అతిపెద్ద క్రీడా సంబరం 'ఆడుదాం ఆంధ్రా'లో మనందరం భాగస్వాములం అవుదామని మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సచివాలయ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. డిసెంబర్ 15 నుంచి ప్రారంభమయ్యే పోటీలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 తేదీ వరకు సాగుతాయన్నారు. రూ.12 కోట్ల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా 15000 సచివాలయాల్లో ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనుండగా.. అందుకు అవసరమైన క్రీడా సామాగ్రి ఇప్పటికే పంపిణీ చేయడం పూర్తయిందన్నారు. ఆటల్లో పాల్గొనేవారందరూ సచివాలయాల్లో పేర్లు నమోదుచేసుకోవాలని సూచించారు.

పురందేశ్వరివి అవగాహనలేని వ్యాఖ్యలు

ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి చేసిన వ్యాఖ్యలు అవగాహన రాహిత్యమని మజ్జి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వాల్లో ఎటువంటి పాలన సాగిందో... ప్రస్తుత వైఎస్సార్‌సీపీ హయాంలో జరుగుతున్న పాలనను బేరీజు వేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదువులు ఇచ్చి సామాజిక సాధికారితను చేసి చూపించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దక్కించుకున్నారన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ పరిశీలకుడు కె.వి. సూర్యనారాయణరాజు ఉన్నారు.

పేదల పక్షపాతి జగన్

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



పేదలకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

మెంటాడ(గజపతినగరం రూరల్): ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. నియోజకవర్గంలోని 703.53 ఎకరాల విస్తీర్ణంలోని అసైన్డ్ భూమిపై 1378 మంది పేద రైతులకు శాశ్వత హక్కులు కల్పించినట్టు తెలిపారు. హక్కు పత్రాలను మార్కెట్ యార్డులో శుక్రవారం అంజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలేని ఎంతో మంది పేదలు సాగుచేసుకుంటున్న భూములపై వారికే సర్వహక్కులను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. బొబ్బిలి ఆర్డీఓ ఎ.సాయిశ్రీ మాట్లాడుతూ అసైన్డ్ భూములు సాగుచేస్తున్న పేద రైతులకు ప్రభుత్వం హక్కులు కల్పించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీలు బెల్లాన జ్ఞానదీపిక, చల్ల చల్లంనాయుడు, గేదెల సింహాద్రి అప్పలనాయుడు, గార తవుడు, రాపాక సూర్యప్రకాశరావు, రౌతురాజేశ్వరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపముఖ్యమంత్రిని కలిసిన వంగపండు ఉష


రాజన్నదొరను కలిసిన సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉష

సాలూరు: ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొరను వైఎస్సార్ సీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉష మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె సాలూరు పట్టణంలోని ఉపముఖ్యమంత్రి ఇంటికి వచ్చి పలు అంశాలపై కాసేపు చర్చించారు.

వెబ్‌సైట్‌లో ప్రొవిజనల్ మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాలలో ఐదు విభాగాల్లో గల పలు పోస్టుల నియామకాలకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 విభాగాల్లో 63 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా పోస్టుల మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టామని, వీటిపై అభ్యంతరాలు ఉంటే ఈనెల ఈనెల 4వతేదీ సాయంత్రం 5 గంటల లోగా తెలియజేయాలని సూచించారు.

రెండు పశువుల శాలలు దగ్ధం


కాలిపోతున్న శాలలోని కలప

సీతానగరం: మండలంలోని జానుమల్లువలసలో గురువారం రాత్రి ప్రజలు గాఢనిద్రలో ఉండగా సంభవించిన అగ్ని ప్రమాదంలో రెండు పశువుల శాలలు దగ్ధం కాగా, బండిలాగే పశువు అగ్ని ప్రమాదానికి గురైనట్లు ఆర్ఐ నాగిరెడ్డి శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ మేరకు బాధితులు తెలిపిన వివరాలపై ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు నిద్రలో ఉండగా వై.తిరుపతిరావు, జి సింహాచలానికి చెందిన పశువుల శాలల్లో అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. అగ్నికీలలు ఎగిసిపడుతున్న సమయంలో ప్రజలు మంటలను అదుపుచేసినట్లు తెలియజేశారు. ఆప్రమాదంలో గాయాల పాలైన తిరుపతిరావుకు చెందిన పశువుకు మండల పశువైద్యాధికారి ఎస్ రామారావు వైద్య సేవలందిస్తున్నారని తెలియజేశారు. శాలలో ఉన్న విలువైన టేకు కలప అగ్నికి ఆహుతైందన్నారు.

శివాలయంలో హుండీ చోరీ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణంలోని నారాయణ స్కూల్ సమీపంలో గల శ్రీ పశుపతినాథ్ బ్రహ్మసూత్ర శివాలయంలోని హుండీని దొంగలు ఎత్తుకుపోయి అందులో డబ్బు దోచుకుని ఖాళీ హుండీని చెరువులో విసిరేశారు. ఈ ఆలయంలోని హుండీని దొంగలు ఎత్తుకెళ్లడం ఇది మూడోసారని ఆలయ అర్చకుడు సురేష్ తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న పట్టణ పోలీసులు అలయానికి చేరుకుని వివరాలు సేకరించారు. సుమారు రూ.50 వేల వరకు నగదు దొంగతనం జరిగినట్లు పోలీసులు అంచనా వేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పట్టణ సీఐ కృష్ణారావు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి


వృద్ధురాలి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక కోట జంక్షన్ సమీపంలో ఉన్న పుట్‌పాత్‌పై గుర్తు తెలియని ఓ వృద్ధురాలు మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం అక్కడికి వెళ్లి పరిశీలించి పరిసర ప్రాంతాల్లో విచారణ చేయగా ఆమె వివరాలు తెలియలేదు. దీంతో మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మృతురాలు సుమారు 65 నుంచి 70 ఏళ్ల వయసు కలిగి ఉంటుందని సీఐ వెంకటరావు తెలిపారు. బంధువులెవరైనా గుర్తిస్తే వెంటనే తమను సంప్రదించాలని కోరారు.

నేడు ఆహార కమిషన్ సభ్యుడి రాక

పార్వతీపురం: రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు శనివారం పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు వస్తున్నారని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్. శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం ఆయన పార్వతీపురం చేరుకుని, వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹80	₹130	₹140

భీష్మ సంకల్పం


కళాపీఠంలో శిష్యులకు సంగీత విద్యను నేర్పిస్తున్న గురువు ఎం.భీష్మారావు

ఘంటసాల పాటలంటే ఆయనకు అంతులేని ఇష్టం. గానగంధర్వుని గానం వింటూ పరవశించిపోతుంటారు. తాను నేర్చుకున్న విద్యను పదిమందికీ ఉచితంగా అందజేయాలనే సంకల్పంతో వచ్చిన చిన్నపాటి ఉద్యోగాలను సైతం వదిలేసి కుటుంబ సమస్యలున్నప్పటికీ ఎలాగోలా అధిగమించారు. శ్రీ పైడితల్లి అమ్మవారి సేవకుడిగా ఉంటూ ఏటా ఆ తల్లికి నిత్య నీరాజనాలు అర్పిస్తుంటారు. ఏడు పదుల వయసు దాటినా, వందలాది మంది శిష్యులు సంగీతంలో రాణిస్తున్నా, ఘంటసాల స్మారక కళాపీఠం ద్వారా తాను చేపడుతున్న సంగీత స్వరాభిషేకాన్ని మాత్రం నిర్విరామంగా కొనసాగిస్తూ అందరికీ ఆదర్శప్రాయుడిగా నిలుస్తున్న ఆయనే ఘంటసాల స్మారక కళాపీఠం భీష్మారావు.

– విజయనగరం టౌన్

- 50 ఏళ్లుగా సంగీతమే ప్రాణంగా సేవలు
- వేలాది మందికి ఉచితంగా తర్ఫీదు
- కోరుకొండ సైనిక విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- ఘంటసాల స్మారక కళాపీఠంతో కళాకారులకు అవకాశాలు

విజయనగరం జిల్లాలో ప్రతి సంగీతాభిమాని నోటా వినే పేరు ఘంటసాల స్మారక కళాపీఠం భీష్మారావు. ఆయన వద్ద సంగీతంలో ఓనమాలు నేర్చుకునేందుకు చాలా మంది వస్తుంటారు. హార్మోనియం, డోలు, డప్పు, కీబోర్డు, పియానో, తబలా, జాజ్, డ్రమ్స్, ఫ్లూట్, గిటార్ వంటివాటిని అవలీలగా వాయిస్తారు. సాధారణంగా పాటలు పాడడమంటే అందరికీ ఇష్టమే. అటువంటి వారందరూ భీష్మారావును ఆశ్రయిస్తారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పిస్తూ, వారిలో ద్విగుణీకృతమైన టాలెంట్‌ను బయటకు తీయడంలో భీష్మారావు తనదైన పాత్ర పోషిస్తున్నారు. వర్ధమాన గాయనీ, గాయకులకు తాము నిర్వహించే భారీ నిర్విరామ సినీ సంగీత విభావరిలో అవకాశాలు కల్పిస్తున్నారు. అంతేకాకుండా గత 50ఏళ్లుగా కోరుకొండ సైనిక్ స్కూల్‌లో విద్యార్థులకు సంగీతం నేర్పిస్తూ, వారికి తర్ఫీదునిస్తున్నారు. ఘంటసాల పట్ల ఆయనకు ఉండే మక్కువతో ఘంటసాల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను జరిపిస్తారు. విజయనగరం పట్టణంలోని గుమ్చీ వద్దనున్న ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకాలు, ఊరేగింపు నిర్వహిస్తారు. ఘంటసాల పేరుమీదనే ఘంటసాల స్మారక కళాపీఠం స్థాపించి ఉచితంగా విద్యార్థులకు సంగీతంలో శిక్షణలు అందజేస్తున్నారు.

ఊపిరి ఉన్నంత వరకూ కళామ్మ తల్లి సేవలో..



ఘంటసాల స్మారక కళాపీఠం స్థాపించిన నాటి నుంచి నేటివరకూ ఎందరో శిష్యులను తయారుచేసుకోగలిగాను. 50 ఏళ్ల ప్రస్థానంలో నా వద్ద విద్య నేర్చుకున్న వారందరూ ఎంతో ఆనందంతో పూర్తిగా నేర్చుకోగలిగానన్న సంతృప్తి వ్యక్తం చేస్తుంటే ఆనందానిస్తుంది. ఉచితంగానే ఉదయం, సాయంత్రం కళాపీఠంలో నేర్పిస్తున్నాను. శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి శ్రీనివాసునికి అన్నమాచార్య గీతాలాపన, భజనలతో కళాకారులకు అవకాశాలు ఇవ్వగలుగుతున్నాను. ఊపిరి ఉన్నంతవరకూ కళామ్మ తల్లి సేవ చేసుకుంటాను.

– ఎం.భీష్మారావు, ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు, విజయనగరం

మనసు ప్రశాంతంగా ఉంటుంది



ఘంటసాల స్మారక కళాపీఠంలో 12 ఏళ్ల క్రితం సరదాగా చేరాను. సంగీతం నేర్చుకుంటూ, పాటలు పాడుకుంటుంటే ఆనందంగా ఉంటుందనే ఉద్దేశంతో గురువు భీష్మారావు వద్ద సాధన చేశాను. ఏ మాత్రం బెదురులేకుండా అనర్గళంగా పాటలు పాడగలుగుతున్నాను. ఐదేళ్ల చిన్నారుల నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకూ సంగీతం, పాటలు పాడేందుకు ఇక్కడికి వస్తున్నారు. మంచి శిక్షణ పొందుతున్నారు.

– ఎస్.సూర్యనారాయణ, రిటైర్డ్ లైన్‌మన్, విజయనగరం

సినీరంగంలో వారసులు

తండ్రి భీష్మారావు చేపట్టిన యజ్ఞంలో కుమారులు సాయి, పవన్‌లు చిన్నప్పటి నుంచి సంగీతాన్ని పుణికిపుచ్చుకున్నారు. గిటార్, జాజ్. డ్రమ్స్, పియానో వంటివాటిలో పూర్తిస్థాయిలో తర్ఫదు పొంది, సంగీత దర్శకుడు కోటి వద్ద చేరారు. ఇండియన్ ఐడల్, మా సూపర్ సింగర్స్, జీ సరిగమప, ఈటీవీ స్వరాభిషేకం, జెమిని బోల్ బేబీ బోల్ ఫేమ్‌లుగా నిలిచి తండ్రిపేరుకు సార్థకత చేకూర్చారు. అనేక తెలుగు చిత్రాలకు సంగీతంలో సహకారమందించారు. ఇటీవలి కాలంలో విడుదలైన డీజె టిల్లు చిత్రంలో సూపర్ హిట్ అయిన డీజె టిల్లు చూడు.. సాంగ్‌కి సంగీతం కంపోజ్ చేయడంలో కీలకపాత్ర పోషించారు.


శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఆధ్యాత్మిక భక్తిగీతాలాపన చేస్తున్న దృశ్యం

10వ తరగతి ఫీజు గడువు పెంపు

పార్వతీపురం: పదవ తరగతి ఫీజు చెల్లింపు గడువును ప్రభుత్వం పెంచిందని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.ప్రేమ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 మార్చి, ఏప్రిల్‌లో జరగబోయే పదవ తరగతి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులు పరీక్ష ఫీజు, ఒకేషనల్, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం 5వ తేదీలోగా ఎటువంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చని తెలిపారు. రూ.50 అపరాధ రుసుము తో 10వ తేదీ, రూ.200 అపరాధ రుసుముతో 12వ తేదీ, రూ.500 అపరాధ రుసుముతో 14వ తేదీలోగా ఫీజు చెల్లించాలని స్పష్టం చేశారు. రెగ్యులర్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125 చెల్లించాలని పేర్కొన్నారు. మూడు సబ్జెక్ట్‌ల కన్నా ఎక్కువ సబ్జెక్ట్‌లు రాసే విద్యార్థులు రూ.125 చెల్లించాలన్నారు. మూడు సబ్జెక్టుల వరకు రూ.110, మైగ్రేషన్ సర్టిఫికెట్‌కు రూ.80, ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60 చెల్లించాలని వివరించారు. ఏజ్ కాండోనేషన్ కోసం రూ.300 చెల్లించాలని స్పష్టం చేశారు. పట్టణాలలో ఉండే ఎస్సీ,ఎస్టీ, బీసీ రెగ్యులర్ విద్యార్థుల తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.24 వేలు, రూరల్‌లో అయితే రూ.20 వేలు మించని వారికి పరీక్ష ఫీజులో మినహాయింపు ఉంటుందని అన్నారు. ఫీజులను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో స్కూల్ లాగిన్‌లో మాత్రమే చెల్లించాలని తెలిపారు.

సూర్యలక్ష్మికి కళామిత్ర పురస్కారం


కళామిత్ర రాష్ట్రస్థాయి అవార్డును భువనచంద్ర, జ్యోతిర్మయిల చేతులమీదుగా అందుకుంటున్న సూర్యలక్ష్మి

విజయనగరం టౌన్: కళా, సామాజిక సేవ, నాటక రంగంలో విశేష కృషిచేస్తున్న విజయనగరం జిల్లాకు చెందిన భోగరాజు సూర్యలక్ష్మిని కళామిత్ర పురస్కారంతో గౌరవించారు. ఒంగోలు పట్టణంలో ఇటీవల సంస్థ 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవ చేస్తున్న వారిని గుర్తించి గౌరవించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన సూర్యలక్ష్మికి కళామిత్ర రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాన్ని ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో కళామిత్ర మండలి ఆధ్వర్యంలో పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ జీవీ.పూర్ణచంద్, సినీ గేయరచయిత భువన చంద్ర, నూనె అంకమరావు, తేళ్ల అరుణ, సింహాద్రి జ్యోతిర్మయి తదితరుల చేతులు ఆమెను ఘనంగా సత్కరించి, అవార్డు అందజేశారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. రాష్ట్రస్థాయి పురస్కారం లభించడంతో పలువురు సాహితీవేత్తలు, అభిమానులు, కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళల కబడ్డీ పోటీల విజేత విజయనగరం జట్టు


రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన జిల్లా మహిళా కబడ్డీ జట్టు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన 70వ సీనియర్స్ మహిళల కబడ్డీ పోటీల్లో విజయనగరం జట్టు సత్తా చాటింది. నవంబర్ 29, 30, డిసెంబర్ 1వ తేదీల్లో కర్నూలు జిల్లా గోనెగొండ్లలో నిర్వహించిన పోటీల్లో జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. విజయనగరం మహిళా జట్టు విజేతగా నిలవడం పట్ల జిల్లా కబడ్డీ అసియేషన్ అధ్యక్షుడు రంగారావుదొర, కార్యదర్శి కేవీ ప్రభావతి హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారిణులు, కోచ్‌ను అభినందించారు.

సైన్స్ కాంగ్రెస్ జాతీయ పోటీలకు ధర్మవరం విద్యార్థి


ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

విజయనగరం అర్బన్: 31వ బాలల సైన్స్ కాంగ్రెస్ జాతీయ పోటీలకు ఎస్.కోట మండలం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి భోజంకి భరత్ రూపొందించిన టీ కాఫీ శాండ్ ప్రాజెక్టు ఎంపికైంది. గుంటూరులోని కేఎల్‌యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో 187 ప్రాజెక్ట్‌లు ప్రదర్శించగా భరత్ రూపొందించిన టీ కాఫీ శాండ్ జాతీయస్థాయికి ఎంపికై నట్లు జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రదర్శనకు గైడ్ టీచర్‌గా పొట్నూరు శివాజీ వ్యవహరించారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని డీఈఓ లింగేశ్వరరెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ ఎం.కృష్ణారావు, జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ టి.రాజేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.మహేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సారా ప్యాకెట్లతో మహిళ అరెస్ట్


సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ అధికారులు

విజయనగరం క్రైమ్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ ఎస్.వెంకటరావు ఆదేశాలతో ఎస్ఈబీ-1 సీఐ మధుకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన పోలిశెట్టి సత్యవతి 140 నాటుసారా ప్యాకెట్లను రవాణా చేస్తుండగా పట్టుబడింది. ఈ మేరకు ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సారా తయారుచేసినా, రవాణా చేసినా, అమ్మినా నిందితులపై పీడీ యాక్ట్ పెట్టేందుకు వెనుకాడమని సీఐ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఎవరైనా సారా అమ్మితే ఫోన్ 9440902362 నంబర్‌కు సమాచారమందించాలని కోరారు. దాడుల్లో ఎస్సై జాన్‌ప్రసాద్, హెచ్‌సీ ధనరాజు, బాషా, కానిస్టేబుల్స్ సౌధాన్య, రవి, లోకభి తదితరులు పాల్గొన్నారు.

శారద కర్మాగారం వద్ద ఉద్రిక్తత

- న్యాయం చేయాలంటూ మృతుడి కుటుంబసభ్యుల ధర్నా
- పోలీసుల సమక్షంలో చర్చలు సఫలం
- రూ 7లక్షల పరిహారం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకారం


మృతుడు మహేష్‌బాబు (ఫైల్)


కర్మాగారం గేటు వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబసభ్యులు, తిమిడి గ్రామస్తులు



మృతుడి కుటుంబసభ్యులతో చర్చలు జరుపుతున్న సీఐ బాలసూర్యారావు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామం సమీపంలో గల శారద కార్మాగారం వద్ద శుక్రవారం ఉదయం తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కర్మాగారంలో పనిచేస్తున్న ఎస్.కోట మండలం తిమిడి గ్రామానికి చెందిన డి.మహేష్‌బాబు అకస్మాత్తుగా అస్వస్థతకు గురై గురువారం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి భార్య తులసి, తల్లి పార్వతిలతో కలిసి మృతుడి బంధువులు, గ్రామస్తులు శుక్రవారం ఉదయం 8 గంటలకు కర్మాగారం వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు.మృతుడి కుటుంబానికి పరిహారం కింద రూ.30లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తూ జనరల్ షిఫ్టుకు వెళ్లే కార్మికులను అడ్డగించి ఆందోళన చేశారు. దీంతో కొత్తవలస, ఎస్.కోట సీఐలు చంద్రశేఖర్, బాలసూర్యారావులు సిబ్బందితో పాటు ప్రత్యేక బలగాలను వెంటపెట్టుకుని ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి బంధువులు, కర్మాగార యాజమాన్య ప్రతినిధులతో చర్చలు జరిపారు. చర్చలు సఫలీకృతం కాకపోవడంతో కర్మాగారం వద్ద తీవ్ర వృద్రిక్తత నెలకొంది. మళ్లీ మరోమారు మధ్యాహ్నం 2 గంటల సమయంలో చర్చలు జరపగా సఫలీకృతమాయ్యియి. యాజమాన్యం ప్రతినిధి సన్యాసిరావు మాట్లాడుతూ మృతిని కుటుంబానికి రూ 7లక్షలు పరిహారంతో పాటు భార్య తులసికి కర్మాగారంలో ఉద్యోగం ఇస్తామని, కార్మిక చట్టం ప్రకారం రావాల్సిన పరిహారం అందించేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలపడంతో మృతుడి కుటుంబసభ్యులు అంగీకారం తెలిపారు. దీంతో ధర్నా విరమించారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు

పార్వతీపురం: ఖరీఫ్‌కు సంబంధించి ఆర్‌బీకేల ద్వారా ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 306 ఆర్‌బీకేలకు గాను 185 ఆర్‌బీకేల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. క్వింటాకు ఎ గ్రేడ్ రూ.2203, సాధారణ రకం రూ.2183లుగా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందన్నారు. రైతులెవరూ దళారులను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే కంట్రోల్ రూం నంబర్లకు ఉదయం 6గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చన్నారు. జిల్లా కంట్రోల్ రూం నంబర్ 08963-293037/ 7702003582, రాష్ట్రస్థాయి కంట్రోల్ రూంనంబర్ 1800-4251967, రాష్ట్ర స్థాయి టోల్ ఫ్రీ నంబర్ 1967 అని తెలియజేశారు.

ఘనంగా సుందరకాండ పారాయణం


సుందరకాండ పారాయణం చేస్తున్న భగవద్రామానుజ దాస బృందం

నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని రామస్వామి వారి దేవస్థానంలో శ్రీరాముడి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం సింహాచలానికి చెందిన భగవద్రామానుజ దాసబృందం ప్రతినిధి కందాళ రాజగోపాలాచార్యులు(రాజా) ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణ కార్యక్రమం ఘనంగా జరిగింది.ముందుగా దేవస్థానం అర్చకులు యథావిధిగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించారు.అలాగే సుందరకాండ హోమం, సుందరకాండ హవనం, అష్టకం అవనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్థాన మంటపానికి సీతారాముల ఉత్సవ విగ్రహాలను వేంచేపుచేసి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా భగవద్రామానుజ దాస బృందం ప్రతినిధి రాజగోపాలాచార్యులు బృందం సభ్యులు సుందరకాండ పారాయణం చేశారు. అలాగే అర్చకులతో కలిసి శ్రీరామపట్టాభిషేకాన్ని నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమాలను దేవస్థానం ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్ పర్యవేక్షించగా, ఆలయ అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, ఖండవిల్లి కిరణ్‌కుమార్, సుదర్శనం పవన్‌కుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


విద్యుత్ షాక్‌తో మృతిచెందిన రామస్వామి

గజపతినగరం: గజపతినగరం ప్రధాన జాతీయ రహదారి వద్ద ఓ ప్రైవేట్ అపార్ట్ మెంట్ వద్ద 11 కేవీ విద్యుత్ వైరు తగిలడంతో షాక్ కొట్టి ఓ వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం జరిగిన ఈ సంఘన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామం నుంచి మినీవ్యాన్‌లో ఇటుక లోడు వేసుకుని డ్రైవర్ రమణ, లేబర్‌గా పని చేస్తున్న సుంకరి రామస్వామి (50), బాలయ్యలు గజపతినగరం వచ్చారు. గజపతినగరంలో ఇటుక లోడు దింపేసి వెళ్లిపోదామనుకున్న తరుణంలో ఇటుక లోడు దించిన ఓప్రైవేట్ అపార్ట్‌మెంట్ పై భాగంలో ఉన్న 11 కేవీ విద్యుత్ వైరు రామస్వామికి తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. రామస్వామికి భార్య రాజు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మొదటి కుమారుడు తిరుమలేష్ ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని గజపతినగరం ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించి కేసు నమోదు చేశారు.

యూనిట్ల స్థాపనపై దృష్టి

- డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి


మాట్లాడుతున కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: పరిశ్రమలకు సకాలంలో అనుమతులు జారీ చేయడంతో పాటు, యూనిట్ల స్థాపనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ది డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ -ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ) సమావేశం కలెక్టరేట్ సమావేశమందిరంలో శుక్రవారం జరిగింది. జిల్లాలో కొత్త పరిశ్రమలు, పారిశ్రామిక వాడల స్థాపన విస్తరణకు ఉన్న అవకాశాలను, భూముల కేటాయింపు, ఇతర అంశాలపై ఈ సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ పీఎంఈజీపీ పథకం కింద ఇప్పటివరకు అనుమతులు మంజూరు చేసిన యూనిట్లను వెంటనే ప్రారంభింపజేసేందుకు కృషి చేయాలని కోరారు. దీనిపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. పరిశ్రమలు, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పారిశ్రామిక వాడల స్థాపనకు పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడానికి తగిన చర్యలు వెంటనే చేపట్టాలని చెప్పారు. కొత్తవలస మండలంలోని బలిఘట్టం, రెల్లి, పెదరావుపల్లి, కంటకాపల్లి గ్రామాల్లో ప్రతిపాదిత భూములను కేటాయించడానికి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో విజయనగరం ఆర్‌డీఓ ఎంవి సూర్యకళ, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ ఆర్.పాపారావు, డీడీ నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు, పరిశ్రమల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లారీని ఢీకొని విద్యార్థి మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు


మృతుడు ఉపేంద్ర (ఫైల్)

సాలూరు: బైక్‌పై వెళ్తూ లారీని ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఓ డిగ్రీ విద్యార్థి మృతిచెందగా, మరో ఇద్దరు విద్యార్థులు తీవ్రగాయాల పాలయ్యారు. సాలూరు పట్టణంలో శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై పట్టణ ఎస్సై నర్సింహమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న పట్టణంలోని దాసరివీధికి చెందిన దాసరి ఉపేంద్ర (20) కళాశాల నుంచి తోటి స్నేహితులు చంద్రశేఖర్, లీలాప్రసాద్‌లతో కలిసి బైక్‌పై పట్టణంలోకి ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి, ముత్యాలమ్మ గుడివద్ద రోడ్డుపై రాంగ్‌పార్కింగ్‌లో ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు.ఈ ప్రమాదంలో ముగ్గురికీ తీవ్రగాయాలవడంతో కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఉపేంద్ర మరణించాడు.